
నిజామాబాద్
ఆదివారం
14.06.2026

సంపుటి : 16 సంచిక: 260
పేజీలు:4 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక



# ‘ఓజి 2’పై సెన్సేషనల్ బజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రాల్లో ‘ఓజి 2’ ఒకటి. దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన ‘ఓజి’ విడుదలకు ముందే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొల్పగా, విడుదల అనంతరం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసింది. స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రం పవన్ కళ్యాణ్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ముఖ్యంగా పవన్‌ను గతంలో ఎప్పుడూ చూడని అవతారంలో సుజీత్ చూపించిన తీరు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ‘ఓజి’ సినిమా ముగింపు సమయంలోనే రెండో భాగానికి సంబంధించిన ఆసక్తికర సంకేతాలు ఇవ్వడంతో అభిమానులు అప్పటి నుంచే ‘ఓజి 2’ కోసం ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చిన్న సమాచారం వచ్చినా అది క్షణాల్లో వైరల్ అవుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ‘ఓజి 2’పై మరో ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది.ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం, పవన్ కళ్యాణ్ ఈ ఏడాది నవంబర్ నెల నుంచి ‘ఓజి 2’ షూటింగ్ కోసం తేదీలు కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది.





# అనుమతులు లేవు.. అడ్మిషన్లు జోరు!

## జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఇష్టారాజ్యం

- నిబంధనలకు తూట్లు
- లక్షల రూపాయల ఫీజుల వసూళ్లు
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
- అనుమతుల్లేని స్కూళ్ల సీజ్‌కు విద్యాశాఖ ఆదేశాలు

**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :**



విద్యా సంవత్సరం ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్న వేళ జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. ప్రభుత్వ అనుమతులు, గుర్తింపులు లేకుండానే పలు విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియను ముమ్మరం చేసి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చిన కొందరు నిర్వాహకులు నిబంధనలను బేఖాతరు చేస్తూ భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే వందకు పైగా అనుమతుల్లేని విద్యాసంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ప్రీప్రైమరీ తరగతులకు ప్రత్యేక అనుమతులు అవసరం లేదనే సాకుతో గల్లీ గల్లీలో కొత్త స్కూళ్లు వెలుస్తున్నాయి. చిన్నారులను దూర ప్రాంతాలకు పంపేందుకు ఇష్టపడని తల్లిదండ్రుల పరిస్థితిని అవకాశంగా మార్చుకొని అడ్మిషన్లు చేపడుతున్నాయి. కొన్ని విద్యాసంస్థలు హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లో పేరుగాంచిన విద్యాసంస్థల పేర్లను పోలి ఉండే విధంగా ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. విద్యాశాఖ అనుమతులు రాకముందే తమకు గుర్తింపు లభించిందంటూ ప్రచారాలు నిర్వహించడం వివాదాస్పదమవుతోంది.

### నిబంధనలకు తూట్లు

ప్రైవేట్ పాఠశాలల స్థాపనకు విద్యాశాఖ నిర్దేశించిన అనేక ప్రమాణాలు తప్పనిసరి. పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు మీటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో రెండు వేల చదరపు మీటర్ల ఆటస్థలం ఉండాలి. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, పారిశుధ్య శాఖ, రోడ్లుభవనాల శాఖల అనుమతులతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరు మరుగుదొడ్లు, లైబ్రరీ, ఇతర మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది. అయితే పలు చోట్ల ఈ నిబంధనలను పట్టించుకోకుండా అద్దె భవనాల్లోనే విద్యాసంస్థలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. అర్హత కలిగిన ఉపాధ్యాయుల స్థానంలో అనుభవం లేని సిబ్బందితో బోధన కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఆందోళన బాటలో విద్యార్థి సంఘాలు

అనుమతుల్లేని పాఠశాలల నిర్వహణ, నిబంధనలకు విరుద్ధంగా నోట్‌బుక్స్, యూనిఫాంల విక్రయాలపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే పలు సంఘాలు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతూ విద్యాశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

### సీజ్‌కు ఆదేశాలు

జిల్లాలో అనుమతులు లేకుండా, ప్రభుత్వ గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ అడ్మిషన్లు చేపడుతున్న విద్యాసంస్థలను సీజ్ చేయడంతో పాటు అవసరమైతే చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించే ముందు సంబంధిత పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు, విద్యాశాఖ అనుమతులు ఉన్నాయో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు.

**చర్యలు తీసుకోవాలి: విద్యార్థి సంఘాలు**

జిల్లాలో అనుమతులు లేకుండా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పెరుగుతున్నప్పటికీ అధికారుల చర్యలు సరిపోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సంబంధిత వివరాలను అధికారులకు అందజేసినా ఫలితం కనిపించడం లేదని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షాలు



- భారీ వర్షాలపై సీఎం అలర్ట్
- అధికారులకు కీలక ఆదేశాలు
- లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- సమన్వయంతో సహాయక చర్యలు

**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో అకస్మాత్తుగా మారిన వాతావరణం, కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. నగరంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వరద నీరు నిలిచే చోట్ల తక్షణమే సహాయక చర్యలు చేపట్టేలా సిబ్బందిని రంగంలోకి దించాలని స్పష్టం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ఎవరూ అజాగ్రత్తగా ఉండకూడదని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని సీఎం ఆదేశించారు. నగరంలో సాధారణ జనజీవనానికి, రవాణా వ్యవస్థకు ఆటంకం కలగకుండా ఉండేందుకు వివిధ ప్రభుత్వ విభాగాలు కలిసికట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ (GHMC), హైడ్రా (HYDRAA), విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్‌తో పాటు ఇతర సంబంధిత శాఖలన్నీ పూర్తి సమన్వయంతో రంగంలోకి దిగాలని ఆదేశించారు. రోడ్లపై ట్రాఫిక్ జామ్‌లను నివారించడం, విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించడం, కరెంట్ స్తంభాలు , ఓపెన్ డ్రైనేజీల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని , ప్రభుత్వ సూచనలను పాటించాలని కోరారు.

## వర్క్ ఫ్రం హోం పోయింది..

# వర్క్ ఫ్రం బైక్ వచ్చేసింది

**చట్టం, స్టేట్ బ్యూరో:**



హైదరాబాద్ నగరంలో చోటుచేసుకున్న ఒక వింత, విడ్డూరమైన సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో తెగ చక్కర్లు కొడుతోంది. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, నెటిజన్లు ఈ దృశ్యాన్ని చూసి అవాక్కవుతున్నారు. అయితే.. ఈ వ్యవహారం కాస్త తీవ్రరూపం దాల్చడంతో దీనిపై సీపీ సజ్జనార్ స్పందించారు.

**ల్యాప్‌టాప్‌తో ‘వర్క్ ఫ్రమ్ బైక్’ ప్రయాణం..**

వైరల్ అవుతున్న వీడియో ప్రకారం.. హైదరాబాద్‌లోని ఒక బిజీ రోడ్డుపై యువకుడు బైక్ నడుపుతున్నాడు. కానీ, అందరి దృష్టి అతడి డ్రైవింగ్ కంటే కూడా బైక్ ఫ్యూయల్ ట్యాంక్‌పై ఉన్న వస్తువు వైపు ఉంది. ఆ యువకుడు బైక్ ట్యాంక్‌పై ల్యాప్‌టాప్ ఉంచి.. ప్రయాణంలోనూ ఆఫీస్ పనిలో మునిగిపోయాడు. రోడ్డుపై వేగంగా బైక్ వెళ్తుండగా, ల్యాప్‌టాప్ స్క్రీన్ ఓపెన్ చేసి ఉండి, అతడు దానిని చూస్తూ డ్రైవింగ్ చేయడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. పక్కన వెళ్తున్న ఇతర వాహనదారులు ఈ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను చూసి షాక్‌కు గురయ్యారు. రోడ్డుపై వెళ్తున్న ఒక వ్యక్తి ఈ ప్రమాదకరమైన దృశ్యాన్ని తన మొబైల్ కెమెరాలో బంధించడంతో ఈ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ఈ వీడియో బయటకు రాగానే సోషల్ మీడియా యూజర్లు దీనిని భిన్న కోణాల్లో విశ్లేషిస్తూ విపరీతంగా షేర్ చేస్తున్నారు. చాలా మంది నెటిజన్లు దీనికి సరదాగా ‘వర్క్ ఫ్రమ్ బైక్’ అని పేరు పెట్టారు. “ఆఫీస్ లేదు, ఇల్లు లేదు.. ఇదో సరికొత్త ట్రెండ్” అని కొందరు కామెంట్లు పెడుతుండగా.. మరి కొందరు “వర్క్ ఫ్రమ్ హోమ్ పాతబడింది.. వర్క్ ఫ్రమ్ బైక్ కొత్తగా వచ్చింది” అంటూ జోకులు పేల్చుతున్నారు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి సినిమాల్లోని స్టంట్స్‌తో దీనిని పోల్చుతున్నారు. ఐటీ రంగంలో ఉద్యోగులపై పెరుగుతున్న పని ఒత్తిడికి ఈ దృశ్యం అద్దం పడుతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ డెడ్‌లైన్లు, పోటీ తట్టుకోలేక రోడ్డుపై కూడా ల్యాప్‌టాప్‌లు ఓపెన్ చేయాల్సి వస్తోందని విమర్శించారు.

## ఆలయాల అభివృద్ధికి

# రూ. 2,216 కోట్లు

- గూడెం సత్యనారాయణ స్వామి ఆలయానికి రూ.70 కోట్లతో అభివృద్ధి
- రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల కోసం రూ.2,216 కోట్లు ఖర్చు: భట్టి
- గోదావరి పుష్కరాల నిర్వహణకు రూ.802 కోట్ల నిధుల మంజూరు
- రైతుల కోసం గూడెం లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.74 కోట్లు

**చట్టం, స్టేట్ బ్యూరో:**



కేవలం దైవభక్తి కోసమే కాకుండా, సమాజంలో మార్పు కోసం విద్యకు , రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారంతా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన మార్పులు తీసుకురావచ్చని తాము గట్టిగా నమ్ముతున్నట్లు చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డి చేపట్టిన ‘పీపుల్స్ మార్చ్’ పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన పిప్పిరి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈ రోజు భూమి పూజ చేసుకోవడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ. 70 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 2,216 కోట్లతో వివిధ దేవాలయాలను అభివృద్ధి చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇటీవల సరస్వతీ పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం కూడా రూ. 802 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవైపు దైవభక్తి కోసం నిధులు ఇస్తూనే, మరోవైపు అన్నదాతలను ఆదుకునేందుకు రూ. 74 కోట్ల వ్యయంతో ‘గూడెం లిఫ్ట్ ఇరిగేషన్’ పనులను కూడా చేపడుతున్నామని, దీనివల్ల స్థానిక రైతులకు సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్రేటర్ ఎన్నికలపై BJP టెన్షన్

**చట్టం, స్టేట్ బ్యూరో:**




గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల విషయంలో తెలంగాణ బీజేపీ కాస్త కంగారు పడుతోందా? ఒకవేళ అలా జరిగితే ఎలా...? అంటూ పార్టీ నేతల మధ్య చర్చలు నడుస్తున్నాయా? అలా జరిగినా కూడా ఇబ్బంది ఉండొద్దంటూ ప్లాన్ సిద్ధమవుతోందా? అసలు ఏంటా అలా....? ఎలా జరిగితే తాము ఇబ్బంది పడతామని కాషాయ దళం కంగారు పడుతోంది? గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్స్‌కు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక నుంచి ఏ రోజైనా నోటిఫికేషన్ రావచ్చని కొందరు, అసలు ఇప్పట్లో ఉండక పోవచ్చని మరి కొందరు అంచనా వేస్తున్నారు. SIR సర్వే ముగిసి కొత్త ఓటర్ లిస్ట్ వచ్చాక ఉండొచ్చు అని కూడా అంటున్నారు.. ఇలా... ఎవరి వాదనలు వారికి ఉన్నాయి తప్ప ఆ విషయంలో ఒక స్పష్టత అయితే లేదు. కానీ... అధికారులు మాత్రం అన్నిరకాలుగా సిద్ధమవుతున్నట్టు సమాచారం. అటు సీఎం రేవంత్ రెడ్డి కూడా గ్రేటర్ పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దీంతో... కమలం పార్టీ ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. మూడు కార్పొరేషన్స్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం గనుక ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే.... ఇక ఆ తర్వాత పెద్దగా టైమ్ ఇవ్వదని, అందుకే ఇక నుంచి ఏ రోజు ప్రకటన వచ్చినా... తాము సిద్ధంగా ఉండాలని భావిస్తున్నారట తెలంగాణ కమలనాథులు. ఇలా రిజర్వేషన్స్ ప్రకటించి అలా ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తే.... అభ్యర్థుల ఎంపిక ఇబ్బంది అవుతుందన్నది బీజేపీ భావన. అదే సమయంలో అధికారంలో ఉన్నారు కాబట్టి కాంగ్రెస్‌నేతలకు రిజర్వేషన్లు, ఎన్నికల తేదీలు లోపాయికారీగా అయినా ముందే తెలిసే అవకాశం ఉంటుందని, అందుకు తగ్గట్టే వాళ్ళు సిద్ధమవుతారన్నది కాషాయ నేతల అనుమానంగా చెప్పుకుంటున్నారు. ఆ మధ్య రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా అభ్యర్థుల ఎంపిక విషయంలో బీజేపీ తంటాలు పడింది. ఇప్పుడు కూడా ప్రభుత్వం ఠక్కున రిజర్వేషన్స్ ప్రకటించి ఎన్నికలకి వెళితే తమకు ఇబ్బంది తప్పదని భయపడుతున్నారట కమలం లీడర్స్. అందుకే... ఆ పరిస్థితి రాకుండా ముందే జాగ్రత్త పడాలనుకుంటున్నట్టు సమాచారం. అందులో భాగంగానే డివిజన్స్ వారీగా పోలింగ్ బూత్‌లు, డివిజన్ మ్యాప్స్ మీద దృష్టి పెట్టినట్టు తెలిసింది. ఆయా డివిజన్స్‌లో ఉన్న ఓటర్లు, గతంలో అక్కడ బూత్‌ల వారీగా బీజేపీకి పడ్డ ఓట్లపై విశ్లేషణ నడుస్తోందట. పార్టీ కోసం పనిచేసే సర్వే ఏజెన్సీలు ప్రస్తుతం ఈ పనిలో ఉన్నట్టు చెబుతున్నారు. పనిలో పనిగా అభ్యర్థి ఎవరైతే బాగుంటుందని ఆరా తీస్తున్నారట. ఆ వార్డ్ ఎవరికి రిజర్వ్ అవుతుందన్న సంగతి తెలియదు కాబట్టి... ఏ సామాజిక వర్గానికి వస్తే ఆ సామాజిక వర్గం నుండి ఎవరిని పెట్టాలన్న విషయంలో లెక్కలేస్తున్నట్టు సమాచారం. అలాగే.... కొత్త డివిజన్ల వారీగా బీజేపీ పని మొదలు పెట్టిందట. దీన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేకంగా మానిటర్ చేస్తున్నట్టు చెబుతున్నాయి బీజేపీ వర్గాలు.

# భారతదేశపు అన్నపూర్ణ – మన తెలంగాణ



- ధాన్య సేకరణలో తెలంగాణ రికార్డు
- 150 లక్షల టన్నుల వరి కొనుగోలు
- రైతులకు రూ.35,537 కోట్ల చెల్లింపులు
- 48–72 గంటల్లోనే డబ్బుల జమ

**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రం మరోసారి తనను తాను ‘భారతదేశపు అన్నపూర్ణ’గా నిరూపించుకుంది. అకుంఠిత దీక్ష, పటిష్టమైన ప్రణాళికలతో ఈ ఏడాది ధాన్య సేకరణలో గత రికార్డులన్నింటినీ బద్ధలుకొడుతూ అసాధారణమైన ప్రగతిని సాధించింది. అన్నదాతల కష్టానికి తగిన ప్రతిఫలాన్ని అందిస్తూ, వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం సరికొత్త చరిత్రను లిఖించింది.

**రికార్డు స్థాయిలో 150 లక్షల టన్నుల వరి కొనుగోలు**

202526 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఏకంగా 150 లక్షల టన్నుల వరిని సేకరించి దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఈ భారీ కొనుగోళ్ల ద్వారా లబ్ధి పొందిన 26.43 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 35,537 కోట్ల భారీ మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా జమ చేసింది. ఐదు పైసల అవినీతికి కూడా తావులేకుండా, దళారీల ప్రమేయం లేకుండా ఇంత పెద్ద మొత్తాన్ని రైతుల అకౌంట్లలోకి చేర్చడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం.

**8,575 కొనుగోలు కేంద్రాలతో పటిష్టమైన వ్యవస్థ**

ఈ చారిత్రాత్మక ఘనవిజయానికి వెనుక రైతు సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి, పక్కా ప్రణాళికే ప్రధాన కారణం. రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లోని మారుమూల రైతులకు సైతం అందుబాటులో ఉండేలా ఈ సమగ్ర వ్యవస్థను తీర్చిదిద్దారు.

**కేవలం 48 – 72 గంటల్లోనే శరవేగంగా చెల్లింపులు**

వరి కొనుగోలు ప్రక్రియ కేవలం సేకరించడంతోనే ఆగిపోకుండా.. రవాణా, నిల్వ, మిల్లింగ్, , తుది చెల్లింపుల వరకు ప్రతి ఒక్క దశలోనూ వివిధ ప్రభుత్వ విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేశాయి. ఈ పటిష్టమైన నెట్‌వర్క్ కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన కేవలం 48 నుండి 72 గంటల వ్యవధిలోనే వారి ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యాయి. గతంలో నెలల తరబడి డబ్బుల కోసం ఎదురుచూసిన రైతులకు ఈ శరవేగపు చెల్లింపుల వ్యవస్థ ఎంతో ఊరటనిచ్చింది. “రైతుకు జరిగే మేలే తెలంగాణ సుభిక్షానికి సూచకం” అనే బలమైన నమ్మకంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సాగునీటి లభ్యత పెంచడం నుండి, పండించిన పంటను మద్దతు ధరతో వేగంగా కొనుగోలు చేయడం వరకు ప్రభుత్వం చూపిస్తున్న ఈ చిత్తశుద్ధి వల్ల తెలంగాణ వ్యవసాయ రంగం మరింత సుసంపన్నం వైపు దూసుకుపోతోంది.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## పేదల ఆరోగ్యానికి అండగా

- **నిమ్స్ వైద్య చికిత్సకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ ఎల్వోసీ అందజేత**



**చట్టం ఇందూరు :** పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని, అవసరమైన వారికి నిమ్స్ లో ఎల్వోసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఎల్వోసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఎల్ఓసి ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగరంలోని గౌతం నగర్ కు చెందిన హేమగ్న మూత్ర పిండాల వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో నిమ్స్ లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రూ.2.40 లక్షల ఎల్వోసీ అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రోగికి తక్షణ సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి: సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్




**చట్టం, శంషాబాద్ :** ఉచిత నేత్ర వైద్య శిబిరాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ అన్నారు. శుక్రవారం శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన మాట్లాడుతూ... ఉచిత నేత్ర వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు నేత్ర పరీక్షలు చేయించుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. కనుక తరచు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోడు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోకు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట ఏ.బి.వి.పి నూతన నగర కార్యదర్శిగా తిప్పేట తరుణ్ ఎన్నిక




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏ.బి.వి.పి సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక మాస్టర్ మైండ్స్ స్కూల్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం నూతన నగర కమిటీని ప్రకటించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏ.బి.వి.పి జాతీయ కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్ పాల్గొని గత 77 ఏళ్లగా ఏ.బి.వి.పి దేశ సేవలో బాగంగా జాతీయ పునర్నిర్మాణం లక్ష్యంగా సమాజ సేవ చేస్తున్న విషయాన్ని గుర్తుచేస్తూ కార్యకర్తలను ఉద్దేశించి మనమంతా జాతీయ భావాలతో దేశానికి సేవ చేస్తూ విద్యారంగ సమస్యలను పరిష్కరించుటకై కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు అనంతరం ఏ.బి.వి.పి స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ & మెదక్ విభాగ్ (ఉమ్మడి జిల్లా) కన్వీనర్ సావుల ఆదిత్య నూతన నగర కమిటీని ప్రకటించడం జరిగింది అందులో భాగంగా సిద్దిపేట నూతన నగర కార్యదర్శిగా తిప్పేట తరుణ్, నగర ఉపాధ్యక్షులుగా రవీందర్ సార్, కార్తీక్, కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా నితిన్, లోకేష్, ఆకాంక్ష్, మహిళ కన్వీనర్ గా అమూల్య, మిషన్ సాహసి కన్వీనర్ గా అఖిల, ఎస్ ఎఫ్ డి కన్వీనర్ గా యోగేష్, ఎస్ ఎఫ్ డి కో కన్వీనర్ గా ప్రశాంత్, ఎస్ ఎఫ్ ఎస్ కన్వీనర్ గా అజయ్, కోకన్వీనర్ గా శ్రీకాంత్, ఖేల్ కన్వీనర్ గా శివ సాయి, కో కన్వీనర్ గా కౌశిక్, సోషల్ మీడియా కన్వీనర్ గా భాస్కర్, కో కన్వీనర్గా హరీష్ ని ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫణిందర్ విద్యార్థులు పాల్గొన్నారు.


## అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్లో పైన చర్యలు తీసుకోండి: బీఎస్పీ



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి హాజరై మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా లో కార్పొరేట్ మరియు ప్రైవేట్ పాఠశాలలు ఎల్కేజీ యూకేజీ కి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ సామాన్య మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న కార్పొరేట్ మరియు ప్రైవేట్ స్కూల్లో పైన వెంటనే చర్యలు తీసుకోవాలి పాఠశాలలు మొదలుకాకముందే బుక్స్ యూనిఫామ్ పాఠశాలల లోనే అధిక ధరలకు అమ్ముతు విద్య హక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కుతున్న అన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేయాలని ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే దీనిపైన బహుజన్ సమాజ్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమస్తుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు రోమాల బాబు సిద్దిపేట అసెంబ్లీ ఇన్చార్జి పంగబాబు బబూత్ అధ్యక్షుడు లతానియల్ , యాదగిరి పాల్గొన్నారు.

## ఫిజీషియన్స్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

- **ఏపిఐ జిల్లా చైర్మెన్‌గా డాక్టర్ గణేష్ వెనిశెట్టి**




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డాక్టర్ గణేష్ వెనిశెట్టి తెలిపారు. ఏపిఐ సిద్దిపేట జిల్లా చైర్మెన్‌గా డాక్టర్ గణేష్ వెనిశెట్టి, వైస్ చైర్మెన్‌గా డాక్టర్ అయిత శివ, జనరల్ సెక్రటరీ డాక్టర్ రజనీస్, ట్రెజరర్ డాక్టర్ సందీప్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ రాజుకుమార్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డా.గణేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తనను చైర్మెన్‌గా ఎన్నుకున్నందుకు తోటి వైద్యులకు దన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సంస్థ అభివృద్ధితో పాటు వైద్యుల శ్రేయస్సు కోసం అహర్నిషలు కృషి చేస్తానని తెలిపారు.

## జిల్లా ఎస్పీని కలిసిన బుద్ధుల బిక్షపతి



**చట్టం న్యూస్, శివ్వంపేట్ :** మెదక్ జిల్లా శివ్వంపేట్ మండల బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి సీనియర్ నాయకులు బుద్ధుల బిక్షపతి జిల్లా ఎస్పీ అయినటువంటి డి.వి. శ్రీనివాసరావు ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇద్దరి మధ్య కొద్దిసేపు చర్చలు జరిగాయి. శివ్వంపేట్ మండలంలో శాంతిభద్రతలు కాపాడాలని బుద్ధుల బిక్షపతి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు, బుద్దుల బిక్షపతి తో మాట్లాడుతూ తప్పకుండా మండలానికి పూర్తి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

# స్క్రీన్ ప్లేని తలపించిన 'ఆపరేషన్ కవచ్'

- **'పోకిరి' స్టైల్లో దొంగను పట్టుకున్న కామారెడ్డి పోలీసులు**
- **గంటల్లోనే చోరీ కేసు ఛేదన.. నిందితుడి అరెస్ట్, సొత్తు స్వాధీనం**



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** "మనం ఒకసారి కమిట్ అయితే మన మాట మనమే వినం" అన్న రేంజ్ లో సినిమా స్క్రీన్ ప్లేని తలపించేలా కామారెడ్డి జిల్లా పోలీసులు మెరుపు వేగంతో స్పందించారు. అర్ధరాత్రి దొంగతనం జరిగితే తెల్లవారేసరికి నిందితుడిని సినిమాటిక్ స్టైల్లో చేజ్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు. 'ఆపరేషన్ కవచ్' మరియు పోలీస్ కంట్రోల్ రూమ్ సమన్వయం ఎంత పక్కాగా పనిచేస్తుందో ఈ ఘటన మరోసారి నిరూపించింది.

**ఘటన ఎలా జరిగింది**

జూన్ 11 రాత్రి దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఇంటికి తాళం వేసి ఇంటి ముందు నిద్రపోయాడు. తెల్లవారుజామున ఇంట్లో వింత శబ్దం రావడంతో లోపలికి వెళ్లి చూడగా అపరిచిత వ్యక్తి సామాన్లు వెతుకుతున్నాడు. యజమానిని చూడగానే దొంగ పారిపోయాడు. ఇంట్లో చూడగా ఒక మొబైల్ ఫోన్, రూ.2,500 నగదు మాయమయ్యాయి.

**డయల్ 100 అలర్ట్.. కంట్రోల్ రూమ్ కమాండ్**

బాధితుడు వెంటనే డయల్ 100కు కాల్ చేసి దొంగ పారిపోయేటప్పుడు వేసుకున్న బట్టల వివరాలను చెప్పాడు. కామారెడ్డి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ వెంటనే యాక్షన్ మోడ్‌లోకి వచ్చింది. వైర్‌లెస్ ద్వారా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, నైట్ పెట్రోలింగ్ బృందాలు, బ్లూ కోల్ట్స్ సిబ్బందికి అలర్ట్ పంపారు. గ్రౌండ్ లెవల్‌లో ఉన్న 'ఆపరేషన్ కవచ్' టీమ్స్ మొత్తాన్ని నిఘా వలయంగా మార్చారు.

**ఆపరేషన్ కవచ్ చెక్‌పోస్ట్ వద్ద దొరికిన దొంగ**

లింగాపూర్ నుంచి కామారెడ్డికి వెళ్లే దారిలో 'వసుంధర వెంచర్' సమీపంలో ఆపరేషన్ కవచ్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో తాడ్వాయి వైపు నుంచి వచ్చిన ఆటోలో ఉన్న వ్యక్తి వేసుకున్న బట్టలు కంట్రోల్ రూమ్ ఇచ్చిన డ్రెస్ డిస్క్రిప్షన్‌తో సరిపోయాయి. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు.

**నిందితుడి నేపథ్యం**

పోలీసుల విచారణలో నిందితుడు లింగాపూర్‌లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి చోరీకి గురైన మొబైల్ ఫోన్, రూ.2,500 నగదును రికవరీ చేశారు. నిందితుడిని రాథోడ్ బొజ్జు, 45, తండ్రి లింబయ్య, నివాసం కన్నాపూర్ తాండా, రామారెడ్డి మండలం, వృత్తి కూలీగా గుర్తించారు. ఇతను పాత నేరస్థుడు. గతంలో దేవునిపల్లి, నిజామాబాద్ ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనం కేసులు ఉండి జైలు శిక్ష కూడా అనుభవించాడు.

**కోర్టులో హాజరు.. రిమాండ్**

దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

**సిబ్బందికి ఎస్పీ రివార్డులు**

ఈ ఆపరేషన్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. దొంగను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ ఏఆర్ శంకర్, కానిస్టేబుళ్లు మోసిన్, రంజిత్, గంగారంలతో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వైర్‌లెస్ అలర్ట్ అందించిన కానిస్టేబుళ్లు సంతోష్ రెడ్డి, రమేష్, దేవరాజ్‌లకు ఎస్పీ కార్యాలయంలో నగదు బహుమతులు అందజేశారు.

**ఎస్పీ ఏమన్నారంటే**

ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, సిబ్బంది చూపిన అప్రమత్తత, వేగవంతమైన స్పందన, సమన్వయంతోనే నేరం జరిగిన కొద్ది గంటల్లోనే నిందితుడిని పట్టుకోవడం సాధ్యమైందన్నారు. ప్రజల భద్రతే పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత అని, 'ఆపరేషన్ కవచ్' నేరాల నియంత్రణలో సమర్థవంతమైన ఫలితాలు ఇస్తోందని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## షబ్బీర్ అలీపై ఫేక్ వాయిస్ రికార్డింగ్‌లు.. కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



- **సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఎస్పీకి వినతి**
- **ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించాలని డిమాండ్**

**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పేరుతో సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్లు, వాట్సాప్ గ్రూపులు, కొన్ని మీడియా సంస్థల్లో ప్రసారం అవుతున్న ఫేక్ వాయిస్ రికార్డింగ్‌లపై సమగ్ర విచారణ జరిపి, వాటిని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా ఎస్పీని కోరారు.

**పోలీసు అధికారులకు ఫిర్యాదు**

ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు జిల్లా ఎస్పీ, డీఎస్పీ, కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు శుక్రవారం ఫిర్యాదు సమర్పించారు.

**వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర**

ఫిర్యాదులో నాయకులు మాట్లాడుతూ, ఇటీవల కొన్ని వాయిస్ రికార్డింగ్‌లను షబ్బీర్ అలీ గారికి సంబంధించినవిగా ప్రచారం చేస్తూ ఆయన వ్యక్తిగత, సామాజిక, రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కుట్రపూరితంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

**AIతో మార్ఫింగ్ చేసే అవకాశం**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆడియోలను ఎడిట్ చేయడం, మార్ఫింగ్ చేయడం లేదా కృత్రిమ మేధస్సు (AI) ద్వారా వాయిస్‌లను సృష్టించడం సాధ్యమవుతున్న నేపథ్యంలో, సంబంధిత ఆడియోల ప్రామాణికతను శాస్త్రీయంగా నిర్ధారించాలని వారు డిమాండ్ చేశారు.

**మూలాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి**

సోషల్ మీడియా, యూట్యూబ్, వాట్సాప్ తదితర మాధ్యమాల్లో ప్రసారం అవుతున్న ఆడియోల మూలాలను గుర్తించి, అసలు ఫైళ్లను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించాలని కోరారు. తప్పుడు, కల్పిత లేదా మార్ఫింగ్ చేసిన ఆడియోలను తయారు చేసి ప్రచారం చేసిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**మీడియా పాత్రపైనా విచారణకు డిమాండ్**


ఆడియోల ప్రామాణికత నిర్ధారణ కాకముందే వాటిని పదేపదే ప్రసారం చేసి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న మీడియా సంస్థలు, సోషల్ మీడియా నిర్వాహకుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత అనుమానాస్పద ఆడియోలను నిరాధార ప్రచారంగా ప్రసారం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**కుట్ర కోణంలో దర్యాప్తు చేయాలి**

ఈ వ్యవహారంలో కుట్ర, పరువు నష్టం, ప్రజలను తప్పుదోవ పట్టించడం లేదా సామాజిక ఉద్రిక్తతలు సృష్టించే ఉద్దేశం ఉందా అనే కోణంలో కూడా సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పోలీసు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గూడెం శ్రీనివాస్ రెడ్డి, పాత రాజు, పండ్ల రాజు, గుడుగుల శ్రీనివాస్, రాజా గౌడ్, చాట్ల రాజేశ్వర్, భూమని బాలరాజు, ఇప్ప శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, సలీం, మీసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మిక పోరాటాలతో దిగివచ్చిన ప్రభుత్వం

- **మంత్రులు ఇచ్చిన హామీల అమలుకు వెంటనే చర్యలు చేపట్టాలి.**
- **నేతన్నలు నేసిన ఉత్పత్తులన్నింటిని టెస్కో కొనుగోలు చేయాలి.**
- **పెంచిన కూలీ రేటును మార్చి నుండే అమలు చేయాలి.**
- **చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెంకట్రాములు**



చట్టం భూపాలపల్లి ప్రతినిధి : వరంగల్ లో చేనేత కార్మికులు డిమాండ్స్ సాధనకై జూన్ 1 నుండి మగ్గాలు బంద్ పెట్టి వివిధ రూపాలలో చేసిన పోరాటాలతో ప్రభుత్వం దిగివచ్చి సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన హామీ ఇవ్వడం కార్మికుల పోరాటానికి విజయమని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు తెలిపారు. చైతన్యంతో సంఘటితమై సమస్యల పరిష్కారానికి మొక్కవోని ధైర్యంతో శాంతియుత నిరసన దీక్షల పోరాటంలో పాల్గొన్న కార్మికులందరికి ఉద్యమాభివందనాలు తెలియజేశారు. టెండర్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిలో చేనేత ఉత్పత్తులన్నింటినీ టెస్కో ద్వారా ఖరీదు చేయాలని గత రెండు నెలలుగా సంబంధిత అధికారులకు సహకార సంఘాల, కార్మిక సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులకు,ఎమ్మెల్యేలకు,మంత్రులకు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన స్పందించనందున ఈనెల 1 నుండి చేనేత మగ్గాలు బందు పెట్టిన ప్రభుత్వంలో చలనం రానందున ఆరవ తేదీ నుండి నిరసన దీక్షలు, కలెక్టరేట్ ముట్టడి ,టెస్కో గోదాం ముట్టడి, బిక్షాటన వివిధ రూపాలలో వందలాది మంది మహిళలతో సహా కార్మికులు పెద్ద సంఖ్యలో శాంతియుత నిరసన దీక్షలలో పాల్గొనడం, వివిధ రాజకీయ పార్టీలు, రాష్ట్రం లోని పలు చేనేత కార్మిక , పద్మశాలి, బీసీ, ప్రజా సంఘాల నాయకులు నిరసన దీక్షల శిబిరాన్ని సందర్శించి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించడం ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తున్న విషయాన్ని గమనించిన చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు శుక్రవారం చేనేత ప్రతినిధులతో హైదరాబాద్ లో చర్చలు జరపి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడం, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గోపాలస్వామి గుడి సెంటర్లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద చేనేతల నిరసన దీక్షా శిబిరాన్ని సందర్శించి 30% కూలీ రేటు పెంచిన దానిని అమలు పరుస్తూ, చేనేత నిల్వలను పూర్తిగా ఖరీదు చేయిస్తామన్నారు. చేనేత కార్మికులు సహకార సంఘాల ద్వారా ఉత్పత్తి చేసిన సరుకును టెస్కో ద్వారా నిరంతరం ఖరీదు చేసేందుకు ఆదేశాలు ఇప్పిస్తామన్నారు. నేతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని మంత్రుల బృందం వారం రోజుల లోపు ముఖ్యమంత్రితో కలిసి మాట్లాడి న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించి చేనేత కార్మికుల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రెక్కాడితే కానీ డొక్కాడని శ్రమజీవులైన చేనేత కార్మికులు పనులు బందు పెట్టి అనేక ఆర్థిక ఇబ్బందులలో ఉండి నిరసన దీక్షలు నిర్వహిస్తుంటే ఆలస్యంగా నైనా స్పందించిన మంత్రులు నిర్దిష్టమైన హామీలు ఇవ్వడం స్వాగతిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలను నిర్దిష్టమైన కాల వ్యవధిలో ప్రభుత్వం అమలు జరిపి రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులకు న్యాయం చేకూర్చాలని లేనిచో చేనేత కార్మిక పోరాటాలు ఉధృతంగా నిర్వహిస్తామని వెంకట్రాములు హెచ్చరించారు.

## సామాజిక సేవా విభాగంలో డాక్టరేట్ అందుకున్న తంగేళ్లపల్లి శ్రీనివాస్ ఆచార్య




**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ నగరానికి చెందిన ప్రముఖ సంఘసేవకుడు తంగేళ్లపల్లి శ్రీనివాస్ ఆచార్యకు సామాజిక సేవా విభాగంలో డాక్టరేట్ లభించింది. తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కాశీలోని "పిలేట్ హెరిటేజ్" హోటల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ గౌరవాన్ని ప్రదానం చేశారు. తంగేళ్లపల్లి శ్రీనివాస్ ఆచార్య గత 22 సంవత్సరాలుగా శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారు. అలాగే శ్రీ నారాయణ అమావాస్య అన్నదాన సేవా సంస్థ ద్వారా గత 25 సంవత్సరాలుగా నిరంతర అన్నదాన కార్యక్రమాలను చేపడుతూ నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు. జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా స్వర్ణకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఆయన, నాగారంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం అధ్యక్షుడిగా 18 సంవత్సరాల పాటు సేవలందించి ఆలయ అభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డారు. హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం దేవాలయ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి ఆలయాల సంరక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. సామాజిక, ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించి తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ డాక్టరేట్‌తో సత్కరించింది. ఈ కార్యక్రమంలో మోహనశర్మ ఆచార్యులు, కృష్ణ యజుర్వేద పండితులు, డాక్టర్ గౌరీశంకర్ మాచవరం, సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మన బడి మన బాధ్యత కార్యకమానికి బండి సంజయ్ పిలుపు




**చట్టం కథలాపూర్ :** జూన్ 15 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో 12 ఏళ్ల సేవా స్ఫూర్తిని పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో "మన బడి మన బాధ్యత" కార్యక్రమాన్ని నిర్వహించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో టిఫిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే జూన్ 13న పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, జిల్లా ఉపాధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వరరావు సూచనల మేరకు పాఠశాల హెచ్ఎం రవీందర్ సమక్షంలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ, గడ్డం రాజేందర్, గూడూరు సురేష్, బత్తుల రవి, బత్తుల తిరుపతి, గాంధారి నాగరాజు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పాఠశాలల పరిశుభ్రత, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడమే "మన బడి మన బాధ్యత" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు.

## శంషాబాద్ డ్రైవింగ్ స్కూల్ ఇంచార్జి గా మల్లేష్ యాదవ్




**చట్టం, శంషాబాద్ :** ఎల్ఎంవీ డ్రైవింగ్ స్కూల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ లో నిర్వహించిన సమావేశంలో డ్రైవింగ్ స్కూల్ అధ్యక్షులను రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ బాలస్వామి గౌడ్ ఆధ్వర్యంలో డ్రైవింగ్ స్కూల్ ప్రెసిడెంట్ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.. రాజేంద్రనగర్ ప్రెసిడెంట్ గా..మసూద్, వైస్ ప్రెసిడెంట్ గా ఖలీమ్, శంషాబాద్ డ్రైవింగ్ స్కూల్ ప్రెసిడెంట్ గా మల్లేష్ యాదవ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ బాలస్వామి గౌడ్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ స్కూల్ సభ్యులు ఆర్టిఏ నిబంధనలను పాటించాలన్నారు. మైనర్లకు డ్రైవింగ్ నేర్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి డ్రైవింగ్ స్కూల్ ను సారథి పోర్టర్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సరైన డ్రైవింగ్ వ్యూహాలను నియమాలను పాటించకపోతే జరిగే నష్టాలను వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పై సభ్యులకు అవగాహన కల్పించారు. తనపై నమ్మకం తో అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు మల్లేష్ గౌడ్ సభ్యులకు కృతజ్ఞత తెలుపుతూ.. అన్ని సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో కే ఆర్ సీ, ప్రభు, శ్రీధర్, డ్రైవింగ్ స్కూల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకులో గోల్మాల్.. డీజిల్‌లో ఐదు లీటర్ల తేడా ఆరోపణ




**చట్టం – కొల్చారం :** మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపులో డీజిల్ కొలతల్లో అవకతవకలు జరుగుతున్నాయని రైతులు ఆరోపించారు. శనివారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఓ రైతు రూ.1,000 విలువైన డీజిల్ కొనుగోలు చేశాడు. డీజిల్ పరిమాణంపై అనుమానం రావడంతో అక్కడే ఉన్న క్యాన్లతో కొలిచి చూడగా సుమారు ఐదు లీటర్ల తేడా ఉన్నట్లు గుర్తించినట్లు రైతు తెలిపాడు. ఈ ఘటనతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరిగిన డీజిల్ ధరల భారం మోస్తున్న రైతులకు ఇలాంటి సంఘటనలు మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్ పంపులో సరైన కొలతలు పాటించకపోవడం వల్ల వినియోగదారులు మోసపోతున్నారని ఆరోపించారు. పెట్రోల్ పంపు నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రైతులు డిమాండ్ చేశారు. అలాగే వినియోగదారులకు నష్టం కలగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
ఆదివారం
14.06.2026


# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- మహిళల కోసం మహిళలతో,మహిళల ఆర్థిక అభివృద్ధికి ఏర్పడినది పరకాల ఇందిరా మహిళా డైరీ
- నిజాయితీ, నిబద్ధత, మన పెట్టుబడి ద్వారా పరకాల ఇందిరా మహిళ పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఏర్పాటు
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి





**చట్టం / పరకాల ;** హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు పరకాల ఇందిరా మహిళా డైరీ కార్యవర్గ సమావేశాన్ని అధికారితో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... డైరీ ఆవశ్యకత, నిర్మాణం యజమాని బాధ్యతలు పాల ఉత్పత్తి,పాల మార్కెటింగ్ పై అవగాహన కల్పించడమే కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.ప్రాథమిక సొసైటీలోనా సభ్యత్వం నమోదు పెంపు,దామెర లో దాదాపు 10 ఎకరాల భూమి కేటాయించామని,తదితర అంశాలపై చర్చించారు.అలాగే ఈ డైరీ ఏర్పాటుకు రాష్ట్ర, యంత్రాంగ కృషి ఎంతో ఉందన్నారు.నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన ఆడబిడ్డల రుణం తీర్చుకునేందుకు పరకాల ఇందిరా మహిళా డైరీ ఏర్పాటుచేస్తున్నామన్నారు.ప్రభుత్వ సహకారంతో అధికారుల కృషితో, రాజకీయాలకు అతీతంగా పరకాల డైరీనీ అభివృద్ధి చేసుకుందాం అని ,ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలంటే పాడి పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవాలన్నారు.ఇది కేవలం ఒక ఆర్థికపరమైన వ్యాపారం మాత్రమే కాదు, ప్రజల జీవితాల్లో వెలుగు నింపే మహా యజ్ఞం అని, ఈ యజ్ఞంలో పరకాల నియోజకవర్గం ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. త్వరలో గ్రామాలలలో పాల సేకరణ చేపట్టాలని,సబ్సిడీ ద్వారా గేదెలు కొనుగోలు, దాన,గడ్డి సేకరణ చేపట్టాలని అన్నారు.5 సంవత్సరాలు నేషనల్ డైరీ డెవలప్మెంట్ తో ఒప్పందం జరిగిందని అన్నారు.

## ఘనంగా వంటేరు ప్రతాప్ రెడ్డి జన్మదిన వేడుకలు



**చట్టం, తూప్రాన్:** గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి జన్మదిన వేడుకలను తూప్రాన్ లో స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి సాయిబాబా ఆలయంలో ప్రతాప్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో బీఆర్ఎస్ కుటుంబ సభ్యుల మధ్య ప్రతాప్ రెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం పేదలకు స్థానిక నేతలు అన్నదానం చేశారు. కార్యకర్తల, నాయకుల ప్రేమాభిమానాలు భవిష్యత్తు ప్రజా సేవకు రెట్టింపు ఉత్సాహాన్నిచ్చిందని ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు సతీష్ చారి, మండల అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నమాజ్ కొండరెడ్డి, కౌన్సిలర్లు చెలిమెల రాములు, జైపాల్ రాథోడ్, బొద్దు రాధా శ్రీనివాస్, జలేష్ యాదవ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, సర్పంచులు ఆంజనేయులు గౌడ్, హరీష్ గౌడ్, శ్రీనివాస్, భాస్కర్, నాయకులు కిష్టారెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, చక్రవర్తి, గొర్రె వెంకట్ రెడ్డి, ఉమా శంకర్, పోతరాజు ధనరాజ్, అనిల్, ముజీబ్, చంద్రారెడ్డి, మన్నె శ్రీనివాస్, విజయ్, సామల అశోక్, ఉపేందర్, రమేష్, పన్నీర్ రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తిగత కారణాలతో బీజేపీకి శంకర్ రాజీనామా




**చట్టం / ఎల్లారెడ్డి :** బీజేపీలో దీర్ఘకాలంగా సేవలందించిన నాయకుడు కుచల కంటి శంకర్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యక్తిగత కారణాల వల్ల క్రియాశీల సభ్యత్వంతో పాటు పార్టీకి వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపారు. 2016లో కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన శంకర్, బూత్ అధ్యక్షునిగా, బీజేవైఎం పట్టణ అధ్యక్షునిగా, అనంతరం పట్టణ ప్రధాన కార్యదర్శిగా పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఈ క్రమంలో ఉపఎన్నికలు, సాధారణ శాసనసభ, పార్లమెంట్, ఎమ్మెల్సీ, మున్సిపల్ ఎన్నికలలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేసిన ఆయన, వివిధ హోదాల్లో అవకాశాలు కల్పించిన పార్టీ పెద్దలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించాలని జిల్లా, పట్టణ నాయకత్వాన్ని కోరారు.

## విద్యుత్ షాక్ తో నాలుగు గేదెలు మృతి



**చట్టం, శంషాబాద్ :** విద్యుత్ షాక్ తో నాలుగు గేదెలు మృతి చెందిన సంఘటన శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే నర్కూడ గ్రామంలో శుక్రవారం రాత్రి ఈదులు గాలులకు విద్యుత్ వైర్ తెగి పడ్డాయి ఉదయం రైతు గడ్డం మల్లేష్ యాదవ్ ఉదయాన్నే వెళ్లి చూడగా విద్యుత్ షాక్ తగిలి నాలుగు గేదెలు మృత్యువాత పడ్డాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే బర్రెలు మృతి చెందాయని రైతు వాపోయారు. మృతి చెందిన గేదల విలువ మూడు లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని వాపోయారు.

## పోలీసు అధికారులను సత్కరించిన జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సీ) సభ్యులు, ప్రతినిధులు శనివారం సిద్దిపేట ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సీఐ)తో పాటు పలువురు ఎస్ఐలను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా పనిచేస్తుందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించి, న్యాయం అందించేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉందన్నారు. జాతీయ మానవ హక్కుల కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణకు సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా తమ వంతు సహకారం అందిస్తూ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నెమలి సుభాష్ గౌడ్, ఉపాధ్యక్షుడు ప్రభు రాజ్, జనరల్ సెక్రటరీ కార్తిక్ రెడ్డి, సలహాదారు ఎర్రవెల్లి సంపత్ రెడ్డి, గౌరవ సలహాదారు రాములు, టౌన్ కమిటీ అధ్యక్షురాలు సునీత, సుజాత, రామ్ గోపాల్, వెంకటలక్ష్మి, కొయ్యడ చందు, రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం చూపుడు వేలును ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు




**చట్టం వెల్దుర్తి :** వెల్దుర్తి మండల పరిధిలోని శేరీల గ్రామంలో ఏప్రిల్ 14 అంబేద్కర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కులమతాలకు అతీతంగా అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి సంబరాలు జరుపుకుని అంబేద్కర్ చూపిన బాటలో నడుస్తామని ప్రమాణం చేసిన 2 నెలల 15 రోజులకే బాబాసాహెబ్ అంబేద్కర్ చూపుడు వేలును ధ్వంసం చేసిన సంఘటన చోటు చేసుకుంది శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చేసిన ఘాతకానికి శనివారం ఉదయం గమనించిన గ్రామస్తులు అవాక్కయ్యారు విషయం తెలుసుకున్న అంబేద్కర్ సంఘ సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై రాజు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పై అధికారుల ఆదేశాల మేరకు అంబేద్కర్ చేతి చూపుడు వేలును మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహ చేతి వేళ్లను ధ్వంసం చేసిన దుండగులను పట్టుకొని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్ ఐ నర్సింగ్ యాదవ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత అందరికీ ఆదర్శ ప్రాయుడు ఒ వర్గానికి సంబంధించిన వ్యక్తి కాదు అంబేద్కర్ విగ్రహ చూపుడు వేలును ధ్వంసం చేయడం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృత్తం కాకుండా చూసుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.

## పరకాలలో నేడు మెగా రక్తదాన శిబిరం

**చట్టం /పరకాల ;** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని యువ నేతాజీ ఫౌండేషన్, వరంగల్ ఆధ్వర్యంలో పరకాల ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో జూన్ 14న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తలసేమియా చిన్నారులు, అత్యవసర చికిత్సల అవసరాల కోసం రక్త నిల్వలను పెంచే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తు న్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలు తక్కువగా ఉండటంతో పలువురు పేద రోగులు సమయా నికి రక్తం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జూన్ 14 ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 50 కిలోల కంటే ఎక్కువ బరువు ఉండి ఆరోగ్యంగా ఉన్న వారు స్వచ్ఛందంగా రక్తదానం చేయవచ్చని నిర్వాహకులు వెల్లడించారు. పరకాల పట్టణానికి చెందిన యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయాలనుకునే వారు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవడానికి బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) 9490115105, కొత్తకొండ అరుణ్ కుమార్ 9666109108, ఎస్.కె. ముస్తఫా 8639865411 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

## ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తున్న పోచారం భాస్కర్ రెడ్డి

- బోర్లం, సోమేశ్వర్ గ్రామాల్లో బాధిత కుటుంబాలకు పరామర్శ



**చట్టం న్యూస్ మోస్రా :** మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి బాన్సువాడ గ్రామీణ మండలంలోని బోర్లం, సోమేశ్వర్ గ్రామాలలో ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయిన పలువురు ఆత్మీయుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బోర్లం గ్రామానికి చెందిన ఆత్మ కమిటీ డైరెక్టర్ గోపాన్‌పల్లి సాయిలు మాతృమూర్తి రామవ్వ, మాజీ ఉప సర్పంచ్ మమ్మయి కాశీరామ్ మాతృమూర్తి ఎల్లవ్వ, ఎన్డీసీసీబీ బాన్సువాడ బ్యాంక్ అటెండర్ సింగరి సతీష్ నానమ్మ నాగవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి నివాసాలకు వెళ్లిన పోచారం భాస్కర్ రెడ్డి మృతుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. అలాగే సోమేశ్వర్ గ్రామ మాజీ సర్పంచ్ మొగులయ్య, బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నాయిని గంగారాం తండ్రి నాయిని హన్మండ్లు (పెద్ద కాపు) మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా సోమేశ్వర్ గ్రామ మాజీ సర్పంచ్ గంగారాం తండ్రి బీమా కిష్టయ్య మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారి దుఃఖంలో తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ, గ్రామీణ మండలాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పోచారం భాస్కర్ రెడ్డి వెంట పాల్గొన్నారు.

## సింగరేణిని బీఆర్ఎస్ ప్రభుత్వం ముంచిందని హెచ్ఎంఎస్ ఆరోపణ

- బాయిబాట కార్యక్రమానికి భయపడుతున్నారని హరీష్ రావుపై విమర్శలు



**చట్టం రామగుండం :** వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన సింగరేణి సంస్థలు ఏనాడు కూడా రాజకీయ జోక్యం లేకుండా సింగరేణి నియమ నిబంధనల ప్రకారంగా పరిపాలన కొనసాగిస్తూ ఆనాడు నష్టాల్లో ఉన్నప్పటికీ ఈనాడు లాభాల్లోకి వచ్చిన ఘనత యాజమాన్యం నిర్ణయాలపై ఉంటే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీ బి ఆర్ ఎస్ కేవలం తన పాపాన్ని గడుపుకోవడం కోసం సింగరేణి యాజమాన్యాన్ని సంస్థను నిలువున ముంచడం కోసం సింగరేణి సంస్థలు రాజకీయాలకు ఆరంగ్రీటం చేసి 15లు పరిపాలన కొనసాగించింది సింగరేణి సంస్థను పీల్చి పిప్పి చేసి ఆనాటి ప్రభుత్వం యొక్క మంత్రుల ఇండ్లలో మంత్రుల ఛాంబర్లలో ఫర్నిచర్ గాని లైట్లు గాని సీసీ కెమెరాలు గాని వారికి సంబంధించిన విలాస వస్తువులు అన్నింటిని కూడా సింగరేణి సొమ్ము ద్వారా కొనుగోలు చేసుకుని దివాలి తీసిన సంఘటన మీది కాదా అంటూ భయపడకు వస్తున్న ఆనాటి మాజీ ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావును హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు హరియాసమ్మ సూటిగా సవాల్ విసిరుతున్నారు ఎందుకు ఇప్పుడు మీకు హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 11 డివిజన్లలో కార్మికులతో సమాయత్తమవుతూ కార్మికుల సమస్యలతో కలిసి పనిచేస్తూ పేరు సంపాదించుకున్న హెచ్ఎంఎస్ నాయకత్వం ఈనెల 15 నుండి సింగరేణి వ్యాప్తంగా బాయి బాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుంటే ఒక్కసారి వెన్నులో వణుకు పుట్టిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఈనాడు హరీష్ రావు కొప్పుల ఈశ్వర్ టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతున్న అతను ఇతర ఎమ్మెల్యేలు బైబాటపై సన్నద్ధమై వస్తుంటే నవ్వేస్తుంది అంటూ ఆయన హెద్యో చేశారు ఎందుకంటే సింగరేణి సంస్థలు బొగ్గును కరెంటును ఉదిరేగా తీసుకొని 25 వేల కోట్ల రూపాయలను నిలువున సంస్థను ముంచేసింది ఇంకా కారుణ్య నియామకాల పేరుతో సింగరేణిలో పనిచేసే డాక్టర్లు చవటలు దద్దమ్మలు వారికి ఏమీ తెలవదని వారి గుర్తించబడ్డ నమ్మక ద్రోహులైన డాక్టర్లను ఈ నియామకంలో స్థానం కల్పించి ఒక్కొక్క కార్మిక నుండి ఈ రకంగా ఉద్యోగం పొందాలంటే 15 లక్షల రూపాయల వరకు రేటు పెంచింది మీది కాదా ఇది అవమానం కదా ఏ పేరుతో మళ్లీ సింగరేణి సంస్థను కాపాడుకుంటున్నాం అంటూ ముందు కాస్తున్నారు మీరంతా కార్మికులకు సమాధానం ఇవ్వాలి కార్మికులు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటూ నిలదీస్తున్నారు హెచ్ఎంఎస్ గోదావరిఖని కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పదేళ్ల నాటి బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ తీరును వారి వల్ల సింగరేణి సంస్థ ఎలా బలైపోయింది అన్న తీరును ఏకరు పెట్టారు ఈ సందర్భంగా ఆర్జీవన్ ఏరియా హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ పోశం మాట్లాడుతూ సింగరేణి సంస్థ కూడా కార్మికుల రక్షణ విషయంలో పూర్తిగా దిగజారి పోయిందని ఏఐటీయూసీ ఐఎన్టీయూసీ యూనియన్లు సింగరేణి లకు రక్షణ కల్పించకుండా వారి స్వలాభాగం కోసం రకరకాల పేర్లతో భక్షించుకుంటూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపిస్తున్నారు సింగరేణిలో పనిచేసే కార్మికులకు భూగర్భ గనుల్లో గాని డిపార్టుమెంటులో గాని ఓపెన్ కాస్ట్ లో గాని వారికి సరిపడే పనిముట్లని ఇవ్వకుండా పనులు చేయించమని ఒత్తిడి చేస్తూ చేయకుంటే మెమోలు చార్జీలు ఇస్తూ కార్మికుల జీవితాలతో కార్మిక కుటుంబాలతో చెలగాటమాడుతున్నారని ఇవి తెలుసుకుండి కూడా ఏఐటీయూసీ ఐఎన్టీయూసీ యూనియన్లు స్పందించకుండా తమ పైరవీలను తమ ఉనికిని కాపాడుకోవడం కోసం సింగరేణి యాజమాన్యానికి అడుగులకు మడుగులొత్తుతూ తమ పబ్బాన్ని గడుపుకుంటున్నారు తప్ప ఎలాంటి సమస్యలను పరిష్కరించడం లేదంటూ కూడా ఆయన ఆరోపించారు సింగరేణి సంస్థలో ఉండే కార్మికులకు సమస్యల పరిష్కారం కోసం అన్ని జాతీయ సంఘాలతో కలుపుకొని సమ్మె చేస్తామని పిలుపునిచ్చిన యాజమాన్యం ఒకేసారి తన వైఖరిని మార్చుకొని రహస్యంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మాత్రమే సమ్మె చేస్తామంటూ సమ్మెకు పిలుపునివ్వడం అవమానకరంగా ఉందంటూ పోషం ఆరోపిస్తున్నారు ఇన్ని ఆరోపణల మధ్య యాజమాన్యం అటు గత ప్రభుత్వాలు ఇప్పుడున్న ప్రభుత్వాలు కార్మికులను ఎలా మోసం చేస్తున్నాయో ఎండగట్టడం కోసమే మా గౌరవ అధ్యక్షురాలు కవితక్కతో మేము అందరం కలిసి సింగరేణి భాయబాట నిర్వహిస్తున్నాం ఈనెల 15 నుండి సింగరేణి అన్ని డివిజన్లో ఈ బాయి బాట కొనసాగుతుంది ఎన్ని ఆటంకాలు వచ్చినా ఆగేది లేదంటూ రియాజ్ అహ్మద్ ఆరేల్లి పోషం బిడ్డ సతీష్ రామ్మోహ న్, శ్రీకాంత్ రెడ్డి మామిడి సంపత్ ఇతర నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వఅధికారులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి



**చట్టం పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గ్రామ పరిపాలన అధికారి, ఇతర రెవెన్యూ అధికారులపై దాడికి ఉసిగొల్పిన, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా గ్రామ పరిపాలన ఆఫీసర్స్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మర్రి శంకర్ స్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పరిపాలన అసోసియేషన్ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మర్రి శంకర్ స్వామి మాట్లాడుతూ వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మాదన్నపేట గ్రామ చెరువులో అక్రమంగా మొరం, మట్టిని తరలిస్తున్న వారిని ఆపడానికి వెళ్ళిన గ్రామపాలన అధికారి నరసింహస్వామి, ఇతర రెవెన్యూ అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దాడికి పాల్పడిన వారికి కఠినమైన శిక్ష విధించినట్టయితే ప్రభుత్వ అధికారుల పై దాడులు ఎవరు కూడా ఇకమీదట చేయరని తక్షణమే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, తీసుకునేలాప్రభుత్వం చూసుకోవాలని జిపిఓల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మర్రి శంకర్ స్వామి కోరారు. ఇదే విషయాన్ని రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరుగకుండా చర్యలు చేపట్టాలని కోరనున్నట్లు జీపిఓల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మర్రి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి పి ఓ ల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మర్రి శంకర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానమే మహాదానం.. ప్రాణదాతగా నిలుస్తున్న వివేకానంద ఫౌండేషన్ ఫౌండర్ సంతోష్



చట్టం న్యూస్ మోస్రా : నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జూన్ 14 ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని వర్ని మండలానికి చెందిన వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రముఖ రక్తదాత సంతోష్ పిలుపునిచ్చారు.ఫిబ్రవరి 19న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన "వివేకానంద వాట్సాప్ గ్రూప్" ద్వారా సంతోష్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి నిరంతరం రక్తం అవసరమైన పేషెంట్లకు స్వయంగా రక్తదానం చేయడంతో పాటు, తన బృంద సభ్యులతో కలిసి అనేక మంది బాధితులకు అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందిస్తూ ప్రాణదాతగా నిలుస్తున్నారు. వివేకానంద ఫౌండేషన్ సభ్యులు సైతం సేవాభావంతో స్పందిస్తూ, రక్తం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వారి సేవల ద్వారా ఎంతో మంది పేషెంట్లకు కొత్త జీవం లభిస్తోందని స్థానికులు ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ సంతోష్ మాట్లాడుతూ, "రక్తదానం మహాదానం. మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం మరొకరి జీవితాన్ని కాపాడగలదు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతతో పాటు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటాలని" కోరారు."రక్తదానం చేయండి... ప్రాణాలను కాపాడండి" అనే నినాదంతో వివేకానంద ఫౌండేషన్ సభ్యులు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని తెలిపారు.

## 31వ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**చట్టం రామగుండం :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రజలను కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే, డివిజన్‌లో అవసరమైన రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇస్రో'ను సందర్శించిన ఖని విద్యార్థి రిశ్విక్

- చిన్న వయసులోనే అవార్డు కైవసం చేసుకున్న ఘనత రిశ్విక్
- రిశ్విని అభినందించిన కృష్ణవేణి పాఠశాల యాజమాన్యం శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయ బృందం



**చట్టం రామగుండం :** అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ ఇస్కాన్ నిర్వహించిన ప్రపంచ స్థాయి 'భగవద్గీత వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్'లో విశేష ప్రతిభ కనబరిచిన స్థానిక తిలక్ నగర్ కు చెందిన రాకం శ్వేతకిరణ్ దంపతుల కుమారుడు, స్థానిక కృష్ణవేణి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రిశ్విక్ ఇస్రో సందర్శనకు ఎంపికై శుక్రవారం కర్ణాటక బెంగళూరులోని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను సందర్శించాడు. ఈ సందర్భంగా శేషాద్రిపురంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ టాపర్స్ అవార్డ్ సెరెమనీలో తన తల్లిదండ్రులు, తమ్ముడు అయాన్ష్ తో కలిసి పాల్గొన్న రిశ్విక్ ను కార్యక్రమ ముఖ్య అతిథి, ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ నేషనల్ టాపర్ మెడల్ తో పాటు మెమెంటోను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రిశ్విక్ మాట్లాడుతూ తనను ఇస్రో సందర్శనకు ఎంపిక చేసిన ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపాడు. ఇస్రోలో శాస్త్రవేత్తలు అంతరిక్ష పరిశోధనలు, రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల నిర్మాణం తదితర అంశాలపై విలువైన సమాచారాన్ని అందించారని పేర్కొన్నాడు. ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ సోమనాథ్‌ను ప్రత్యక్షంగా కలుసుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపాడు. ఇస్రో సందర్శనకు తనను ప్రోత్సహించిన కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మంజులా శ్రీనివాస్ రెడ్డి, క్యాంపస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తన తల్లిదండ్రులకు రిశ్విక్ కృతజ్ఞతలు తెలిపాడు.

## బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా గొల్ల ప్రభు



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా చేగుంట పట్టణానికి చెందిన గొల్ల ప్రభును మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గొల్ల ప్రభు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని బీసీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్. అరుణ్ కుమార్, పి. మనోజ్ కుమార్ గౌడ్, టి. కిషోర్, ఎం. రమేష్ కుమార్ యాదవ్, లలిత యాదవ్, మేకల రాములు యాదవ్, వంశీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఘన స్వాగతం



**చట్టం, బోథ్ :** ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నేరడిగొండ టోల్ ప్లాజా వద్ద ఘన స్వాగతం లభించింది. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావును శాలువాతో సన్మానించి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, దర్బ సర్పంచ్ సీతారాం, మర్లపెల్లి ఉప సర్పంచ్ రమేష్, సాయన్న, సద్దాం, మొగులన్న, పోతారెడ్డి, చందు, జలపతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై స్వాగత కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## ఏఐసిసి జాతీయ అధ్యక్షుని కలిసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ



(చట్టం ప్రతినిధి కామారెడ్డి) కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్య సభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ శనివారం కలవడం జరిగింది. బెంగళూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## వర్షాలు కురవాలని రామకోటి సంస్థ ఆధ్వర్యంలో అభిషేకాలు

- **నిర్వహించిన భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు**
- **కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు రాంసాగర్ సీతారాములు**



**చట్టం సిద్దిపేట (దుబ్బాక) :** ఈ సంవత్సరం వర్షాలు సంమృద్ధిగా కురవాలని శనివారంనాడు శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలోని రామాలయంలోని సీతారాములకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహించి వేడుకున్నారు. అనంతరం భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు మాట్లాడుతూ వర్షాలు సంమృద్ధిగా కురుస్తేనే రైతు ఆనందంగా ఉంటారన్నారు. వర్షాలు సంమృద్ధిగా కురిసినట్లయితే పాడి పంటలు పండుతాయన్నారు. దీని ఆధారంగా వ్యవసాయం ముందుకు సాగుతుందన్నారు. దేశానికి రైతే వెన్నుముఖ. అలాంటి రైతు సుఖంగా లేకుంటే పరిపాలనా అస్తవ్యస్థంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయ అధ్యక్షులు ఎనిశెట్టి వెంకటేశం, నాయిని ఆదిరెడ్డి, బిక్కుమల్ల నగేష్, శ్రావణ్, చంద్రమౌళి, రామకృష్ణ, చంద్రం పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన విజయ చందర్ రెడ్డి



**చట్టం / పరకాల ;** దామెర మండలం లాదెల్ల గ్రామానికి చెందిన 84వ బూత్ మాజీ అధ్యక్షులు డెంగు అశ్వినినవీన్ దంపతుల పుత్రిక హిమశ్రీ ప్రథమ జన్మదిన వేడుకలకు హాజరైన బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జి డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి చిన్నారిని ఆశీర్వదించి జన్మదిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి హిమశ్రీకు ఉజ్వల భవిష్యత్తు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు పిట్టల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి సుర చందర్, బూత్ అధ్యక్షులు అన్నబోయిన రోహిత్, సింధె శ్రీనివాస్, కలువల తిరుమలేష్, బత్తుల సుమంత్, ననబోయిన శ్రీనివాస్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శించిన డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్



**చట్టం / పరకాల ;** పరకాల పట్టణానికి చెందిన 12వ వార్డ్ కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్ నానమ్మ ఆకుల సత్యవ్వ ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డ్ కౌన్సిలర్ కుక్కల విజయ్, సంగ పురుషోత్తం,మెంతుల సురేష్, పిట్ట కిషోర్, కోడెల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై ఏబీవీపీ ఫైర్

- **అధిక ఫీజులు, అనుమతులు లేని అడ్మిషన్లపై ఆగ్రహం**
- **"గుర్తింపు రద్దు చేయకపోతే గాడిదతో డీఈఓ ఆఫీసు ముట్టడిస్తాం" హెచ్చరిక**

(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసి అక్రమంగా అడ్మిషన్లు చేసిన, పుస్తకాలు అమ్మిన, అధిక ఫీజులు వసూలు చేసిన, అలాగే ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది.

**విలేకరుల సమావేశం**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కామారెడ్డి నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

**ప్రైవేట్ స్కూళ్లపై ఆరోపణలు**

ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో, మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలు అక్రమంగా అడ్మిషన్లు జరుపుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా 9, 10 వ తరగతులకు అడ్మిషన్లు చేస్తున్నారని, క్వాలిఫైడ్ టీచర్లు లేకుండా విద్యార్థులపై కల్తీ విద్య కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు.

**అధికారుల తీరుపై ఆగ్రహం**

ప్రభుత్వ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా స్పందించక పోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర లేచి ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేసి గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**డీఈఓ ఆఫీసు ముట్టడి హెచ్చరిక**

లేకపోతే గాడిదతో డీఈఓ ఆఫీసు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అక్షయ్, కౌశిక్, స్వస్తిక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

- **పోలీస్ అంటే మానవత్వం.. నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన కానిస్టేబుల్**
- **మృతుని కుటుంబానికి రూ.5వేలు అందించిన జుక్కల్ కానిస్టేబుల్ శ్రీను నాయక్**



(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) పోలీస్ అంటేనే ధైర్యం. ఏ ఆపద వచ్చినా మొదటగా గుర్తుకు వచ్చేది పోలీసులే. ఆ పోలీసులకు మానవత్వం తోడైతే ఏ పేదవాడికీ కన్నీరు ఉండదని చెప్పేందుకు జుక్కల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ శ్రీను నాయక్ నిదర్శనంగా నిలిచారు.

**అంత్యక్రియలకు కూడా లేని పరిస్థితి**

మాచారెడ్డి మండలం ఎల్లంపేట పక్క గ్రామం పందిమడుగు తాండకు చెందిన భూక్యా శ్రీను మరణించారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది.

**విషయం తెలిసి సాయం చేసిన కానిస్టేబుల్**

విషయం తెలుసుకున్న ఎల్లంపేట గ్రామానికి చెందిన కానిస్టేబుల్ శ్రీను నాయక్ వెంటనే స్పందించారు. అంత్యక్రియలకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి కొండంత మనోధైర్యాన్ని ఇచ్చారు.

**'నేనున్నా' అంటూ భరోసా**

మృతి చెందిన శ్రీను భార్య జున్ను, ఇద్దరు కుమారులైన మహేందర్, వీరేందర్‌లకు 'నేనున్నా' అంటూ భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం చేసిన కానిస్టేబుల్ శ్రీను నాయక్‌ను స్థానిక నాయకులు, గ్రామస్తులు అభినందించారు. పోలీస్ అంటే శాంతిభద్రతలే కాదు, మానవత్వానికి మారుపేరని శ్రీను నాయక్ నిరూపించారని ప్రశంసించారు.

## సింగరేణి పెన్షన్ రూ.10 వేలకు పెంచే వరకు పోరాటం కొనసాగుతుంది

- **ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**చట్టం రామగుండం :** సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం పార్లమెంట్‌లో నిరంతరం గళం విప్పుతానని, సింగరేణి పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచేందుకు బలంగా పోరాడతానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సింగరేణి మెడికల్ ఇన్వాలిడ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు డిపెండెంట్ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణ, సింగరేణి కార్మిక నాయకులు, సంస్థ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో దివంగత కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి కేంద్ర ప్రభుత్వంతో పోరాడి సంస్థను కాపాడటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సింగరేణి కార్మికుల కోసం పెన్షన్ విధానాన్ని తీసుకురావడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో తరచూ ప్రస్తావిస్తున్నానని, భవిష్యత్తులో కూడా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. సింగరేణి పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సవాల్ విసురుతూ, సింగరేణి కార్మికులపై నిజమైన ప్రేమ ఉంటే వారి పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో కార్మికుల పోరాటాల వల్లే రాష్ట్ర సాధన సాధ్యమైందని, వారి త్యాగాలు, కృషిని ఎప్పటికీ మరవకూడదని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి త్వరితగతిన సహాయం అందించాలని కోరారు.

అలాగే మెడికల్ బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించి మెడికల్ ఇన్వాలిడ్ కార్మికుల కుటుంబ సభ్యులకు డిపెండెంట్ ఉద్యోగాలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు.

## రామగుండం కార్పొరేషన్‌లో కొత్త ర్యాగ్‌పిక్కర్ల నియామకాలు వద్దు




**పాత కార్మికులనే కొనసాగించాలని వినతి**

**చట్టం, రామగుండం :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్త ర్యాగ్‌పిక్కర్లను నియమించకుండా, ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులనే కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రామగుండం కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. గౌస్ ఆధ్వర్యంలో మేయర్ మహంకాళి స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ, గత 26 సంవత్సరాలుగా ఇంటింటి చెత్త సేకరణ చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తున్న 140 మంది చెత్త సేకరణ కార్మికులకు కార్పొరేషన్ నుంచి నెలకు రూ.4,000 మ్యాచింగ్ గ్రాంట్ మాత్రమే అందుతోందని తెలిపారు. ఇంటి యజమానులు చెల్లించాల్సిన రూ.40 కూడా అందరూ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీంతో వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ఇంటింటి చెత్త సేకరణతో పాటు వార్డుల్లో పారిశుధ్య పనులు, రోడ్లపై చెత్త తొలగింపు, ట్రాక్టర్లలో లోడింగ్, డంప్‌యార్డుకు తరలింపు వంటి అనేక బాధ్యతలు నిర్వర్తిస్తున్న కార్మికులను ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గతంలో 70 మంది పారిశుధ్య కార్మికులు ఉండగా, ప్రస్తుతం డివిజన్ల సంఖ్య 50 నుంచి 60కు పెరగడంతో పనిభారం అధికమైందన్నారు. కార్మికుల కొరత కారణంగా ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరంతరంగా పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తతో ప్రత్యక్ష సంబంధం ఉండటంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కార్మికులకు సబ్బులు, బెల్లం, కొబ్బరి నూనె, మాస్కులు, ఎండ నుంచి రక్షణకు రుమాళ్లు వంటి కనీస భద్రతా సామగ్రిని అందించాలని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మూడు ప్రధాన డిమాండ్లను ముందుంచారు. ఇప్పటికే పనిచేస్తున్న కార్మికులకు పోటీగా కొత్త ర్యాగ్‌పిక్కర్ల నియామకాలను రద్దు చేయాలని, ట్రాలీ డ్రైవర్లను తొలగించవద్దని, చట్టప్రకారం కార్మికులకు అవసరమైన కనీస వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఇంటింటి చెత్త సేకరణ కార్మికులు పాల్గొన్నారు.

## 75సార్లు రక్త దానం చేసిన ప్రభుత్వ టీచర్ కామిడి సతీష్ రెడ్డి

- **జూన్ 14 స్వచ్ఛంద రక్త దాతల దినం సందర్భంగా**



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** అన్ని దానాలలో కెల్లా రక్త దానం మిన్న. రక్త దానం ప్రాణ దానం తో సమానం . ఈ విషయాన్ని అక్షరాల నిజం చేస్తూ 75 సార్లు రక్త దానం చేసి అందరిచే శభాష్ అనిపించుకున్న కామిడి సతీశ్ రెడ్డి స్వ గ్రామం చిట్యాల మండలం జడల్ పేట భూపాల్ పల్లి జిల్లా మహా ముత్తారం మండలం ములుగు పల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ బయాలజీ టీచర్ గా పని చేస్తూ ఉన్నారు .1994 నుండి రక్త దానం చేస్తున్నారు . ప్రతీ ఏటా తప్పక మూడు నుండి నాలుగు సార్లు రక్త దానం చేస్తూ అందరికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి ఎక్కువ సార్లు రక్త దానం చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. కరోనా సమయం లో కూడా అనేక సార్లు రక్త దానం చేసి అనేక ప్రాణాలు కాపాడారు.2014 లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ నరసంహన్ నుండి ఉత్తమ రక్త దాత అవార్డ్ అలాగే అప్పటి వరంగల్ జిల్లా కలెక్టర్ , యస్ .పి ల నుండి పలు అవార్డు లుఅందుకున్నారు. అలాగే ఉమ్మడి జిల్లా లో అప్పటి జిల్లా కలెక్టరు, యస్. పి గార్లచే కూడా పలు మార్లు అవార్డు లు అందుకున్న ఘనత వీరిదే . రక్త దానం చేయడం సతీష్ రెడ్డి హాబీ. అంటారు.తనతో పాటు అనేక మంది నీ రక్త దానం చేయడానికి ముందుకు తీసుకు వస్తున్నరు . సుమారు 20 వరకు రక్త దాన శిబిరాలు నిర్వహించి వందల మందిచే రక్త దానం చేయించారు.రక్త దానం చేయడం వల్ల శరీరం బలహీన పడదు.నీరసం రాదు. చాలా చురుకుగా వుంటారు.అని వారు చెపుతారు.ప్రతీ ఒక్కరూ రక్త దానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి పునర్జన్మను ప్రసాదించిన వారు అవుతారని అంటారు.వారి రక్త గ్రూప్ 0 పాసిటివ్. రక్తం ఇవ్వడం వల్లనే ఆరోగ్యంగా వున్నానని చెపుతూ వుంటారు.అలాగే సతీష్ రెడ్డి మరణానంతరం వారి పార్ధీవ దేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాల కు ఇవ్వడానికి కూడా అంగీకార పత్రం అందచేసారు.మరో ఇరవై మందితో అంగీకార పత్రాలు అంద జేశారు . అలాగే తెలంగాణ సామాజిక రచయితల సంఘం అధ్యక్షులు గా ఇప్పటి వరకు ఎన్నో సామాజిక అంశాల మీద సుమారు 2500 వరకు వ్యాసాలు రాశారు. సతీష్ రెడ్డి ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు రక్త దానం చేయడానికి ముందుకు రావాలి.

## టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) పై అవగాహన – శిక్షణ శిబిరం




**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు (BLA) కోసం ఏర్పాటు చేసిన అవగాహన మరియు శిక్షణ శిబిరంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు టిపిసిసి జనరల్ సెక్రెటరీ మరియు జుక్కల్ నియోజకవర్గ అబ్జర్వర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా BLAలు కృషి చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఓటర్ల జాబితా కీలకమని పేర్కొన్నారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు నవీన్ పెట్టాం , ఏఎంసీ చైర్మన్లు కవిత ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ సీమా సెట్ కార్, బిచ్కుంద మండల పార్టీ అధ్యక్షుడు నాగనాథ్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విఠల్ రెడ్డి బిచ్కుంద మండల పట్టణ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి జుక్కల్ మండల్ పార్టీ అధ్యక్షుడు రమేష్ దేశాయ్ మద్నూర్ మండల అధ్యక్షుడు సాయిలు కోడప్పగల్ మండల అధ్యక్షుడు శ్యామ్ పటేల్ నిజాంసాగర్ మండల అధ్యక్షుడు పండరి డోంగ్లి మండల అధ్యక్షులు దేశాయ్, నౌషా నాయక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, BLA ల ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు

## ఆర్ కే సెవెన్ గని పై కవితక్క బాయి బాట పోస్టర్ల ఆవిష్కరణ!



**చట్టం రామగుండం :** శ్రీరాంపూర్ డివిజన్ లోని RK 7 గని వద్ద హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన మరియు హెచ్ఎంఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క బాయి బాట పోస్టర్లను హెచ్ఎంఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు తిప్పారపు సారయ్య పాల్గొని ప్రసంగించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలైన యు సి ,ఐ ఎన్ టి యు సి సంఘాలు పూర్తిగా విఫలమై చెందాయి. సింగరేణి సంస్థ పూర్తిగా రాజకీయ జోక్యంలో కోరికపోయింది. ట్రేడ్ యూనియన్ వ్యవస్థ లేకుండా చేయడానికి కుట్రలు జరుగుతున్నాయి. ఇప్పటికే సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. గెలిచిన సంఘాల చేతగానితనం వలనే ఈ పరిస్థితి దాపురించి. కాబట్టి కార్మికుల ప్రధాన సమస్యలైన సింగరేణి పరిరక్షణ, నూతన బొగ్గు బావుల సాధన, మెడికల్ బోర్డు గతంలో మాదిరిగా ఎలాంటి అవాంతరాలు లేకుండా కొనసాగించుట, కార్మికులకు ఇన్కంటాక్స్ మినహాయించుట, పాత విఆర్ఎస్ స్కీము పున ప్రారంభించుట, సింగరేణి కి రావాల్సిన 55 వేల కోట్ల రూపాయల బకాయిలను వసూలు చేయించుట, బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పుట, మారుపేరుల సమస్యలు పరిష్కారం కోసం,డిస్మిస్ విధానానికి వ్యతిరేకంగా మొదలగు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటితోపాటు తెలంగాణ రక్షణ సేన పార్టీ పంచ జన్య పథకాలైన రాష్ట్రంలో అందరికీ ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం ఉపాధి, అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా కార్మికులను కలిసి వివరించి భరోసా ఇవ్వడం కోసం రావడం జరుగుతుంది. ఈ బాయి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, బ్రాంచ్ సెక్రటరీ పొనగంటి అశోక్, ఆర్కే సెవెన్ ఫిట్ సెక్రెటరీ చెవుల శ్రీనివాస్, నాయకులు మీసాల మహేందర్ ఎర్రంశెట్టి సాయికుమార్, పవన్ శ్రీనివాస్, హెచ్ఎంఎస్ కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.

## అమెరికాలో ప్రాణాల కోసం పోరాటం చేస్తున్న స్పందనకు అండగా పెరిక సంఘం

- **రూ.1,51,216 ఆర్థిక సాయం అందించిన పెద్దపల్లి జిల్లా కమిటీ**



**చట్టం రామగుండం :** అమెరికాలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన లగిశెట్టి స్పందనకు పెద్దపల్లి జిల్లా పెరిక సంఘం చేయూతనందించింది. స్పందన చికిత్స కోసం తక్షణ సాయంగా రూ.1,51,216 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేసింది. ఉన్నత చదువులు, మంచి భవిష్యత్తు లక్ష్యంగా అమెరికాకు వెళ్లిన స్పందన చికాగో నగరంలో మే 31న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. మెట్రో స్టేషన్ పైభాగం నుంచి సుమారు 25 అడుగుల ఎత్తు నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం కోమాలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దపల్లి జిల్లా పెరిక సంఘం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. సమాజం మొత్తం వారి వెంటే ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం సంఘం తరపున సేకరించిన రూ.1,51,216 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ స్పందన త్వరగా కోలుకుని స్వదేశానికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. సేవాభావం కలిగిన దాతలు ముందుకు వచ్చి మరింత సహాయం అందించాలని కోరారు. సమాజం ఏకమైతే కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచి ఆశను నింపగలదని, స్పందన ఆరోగ్యంగా కోలుకుని తిరిగి తన కుటుంబ సభ్యుల మధ్యకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెరిక సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని బాధిత కుటుంబానికి మద్దతు తెలిపారు.

## చేగుంటలో గొలుసు దొంగల హల్ చల్



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున గొలుసు దొంగలు రెచ్చిపోయారు. వాకింగ్ ముగించుకొని ఇంటికి వస్తున్న ధనలక్ష్మి అనే మహిళను ద్విచక్ర వాహనం పై వచ్చిన ఇద్దరు దుండగులు అడ్రస్ అడిగినట్లు మాట్లాడారు అనంతరం ఆమె మెడలోని బంగారు పూసలతాడును లాక్కొని ప్రయత్నం చేశారు. మహిళ ప్రతిఘటించడంతో సగం పుస్తెలతాడును తీసుకొని పరారయ్యారు బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసు దర్యాప్తు చేపట్టారు.

## రక్తదానం – ప్రాణదానం

- **రక్తదానం చేయండి – ప్రాణాలను కాపాడండి**

**చట్టం / పరకాల ;** రక్తానికి ప్రత్యామ్నాయం లేదు అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన రక్తాన్ని కేవలం మరో మనిషి మాత్రమే అందించగలడు. ఈ గొప్ప మానవతా సేవను గుర్తుచేస్తూ ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద రక్తదాతల సేవలను ప్రపంచం గుర్తించి వారికి కృతజ్ఞతలు తెలియజేస్తుంది. అపఘాతాలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, రక్తహీనత, క్యాన్సర్ వంటి అనేక ఆరోగ్య సమస్యల సమయంలో రక్తం అత్యవసరంగా అవసరమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో స్వచ్ఛందంగా రక్తదానం చేసే దాతలు అనేక మంది ప్రాణాలను కాపాడుతున్నారు. వైద్య నిపుణుల సూచనల ప్రకారం ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు నిర్దిష్ట వ్యవధిలో రక్తదానం చేయవచ్చు. రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని, సమాజానికి అమూల్యమైన సేవ చేసిన సంతృప్తి లభిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ సందర్భంగా యువత, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ముందుకు వచ్చి రక్తదాన శిబిరాల్లో పాల్గొని రక్త నిల్వలను పెంచాలని ఆరోగ్య శాఖ అధికారులు పిలుపునిస్తున్నారు.

**"మీ ఒక్క యూనిట్ రక్తం... ఎవరికో ఒక కొత్త జీవితాన్ని అందించగలదు. రక్తదానం చేయండి – ప్రాణాలను కాపాడండి."**

**(శివకుమార్ ఓదెల జర్నలిస్ట్ పరకాల)**

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com